

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన



కొడంగల్, జనవరి 18: పలుగురాళ్ల తండాలో గురువారం కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. 'వికసిత్ భారత్'లో భాగంగా గ్రామీణ బ్యాంక్ అధికారులు, బీజేపీ నాయకులు కేంద్ర పథకాలను వివరించి, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.



- ఈ నెలాఖరుతో ముగియనున్న పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం
- ఇప్పట్లో పంచాయతీ ఎన్నికలు లేనట్లే
- లోక్‌సభ ఎన్నికల తరువాత ఒకేసారి స్థానిక ఎన్నికలకు కసరత్తు

"గ్రామ పంచాయతీల పాలకవర్గాల గడువు ఈ నెలతో ముగుస్తుంది. దీంతో వీటికి వెంటనే ఎన్నికలు నిర్వహిస్తారా.. పాలకవర్గాల పదవీ కాలాన్ని పొడిగిస్తారా.. పర్సన్ ఇన్‌చార్జిలతో పాలన సాగిస్తారా.. లేక ప్రత్యేకాధికారులను నియమిస్తారా అన్న సందిగ్దం అందరిలోనూ నెలకొంది. అయితే, ఇప్పటికిప్పుడు ఎన్నికలు నిర్వహించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని తేలిపోయింది. వచ్చే లోక్‌సభ ఎన్నికల తర్వాతనే ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. అప్పటి వరకు ప్రత్యేకాధికారులను నియమించాలన్న ఆలోచనకు ప్రభుత్వం వచ్చింది. వీరి నియామకం కోసం ఇప్పటికే కసరత్తు ప్రారంభించింది.

పంచాయతీలకు ప్రత్యేకాధికారులు!

జాబితాను సిద్ధం చేస్తున్న సర్కార్

పంచాయతీల సంఖ్య (జిల్లాల వారీగా)

జిల్లా	సంఖ్య
రంగారెడ్డి	558
వికారాబాద్	566
మేడ్చల్	61

(ఆంధ్రజ్యోతి, రంగారెడ్డి జిల్లా ప్రతినిధి)

పంచాయతీ పాలకవర్గాల గడువు ఈ నెలాఖరు నాటికి ముగియనుండడంతో గ్రామపంచాయతీలకు ప్రత్యేకాధికారులను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు మొదలు పెట్టింది. ఇటీవలే రాష్ట్రంలో అధికార పగ్గాలు చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం గడువులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించేందుకు ఆసక్తి చూపడం లేదు. సాధారణంగా పంచాయతీ ఎన్నికలకు కనీసం 45 రోజుల ముందు నుంచే ఎన్నికల ప్రక్రియ మొదలు పెడతారు. అయితే, ఇప్పటి వరకు అసలు పంచాయతీ ఎన్నికల ప్రక్రియనే మొదలు పెట్టలేదు. ఇంకా పట్టుమని 15 రోజుల గడువు కూడా లేకపోవడంతో ఇప్పట్లో ఎన్నికలు జరిగే పరిస్థితి కనిపించడం లేదు. పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారానే పాలన సాగించేందుకు సర్కార్ చకచకా ఏర్పాట్లు చేస్తోంది. మండల స్థాయి అధికారులను పంచాయతీ స్పెషల్ ఆఫీసర్లుగా నియమించేందుకు వివిధ కార్యాలయాల నుంచి జిల్లా పంచాయతీ అధికారులు సమాచారం తెప్పించుకుంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల విధుల్లో పాల్గొనని అధికారులను ప్రత్యేకాధికారులుగా నియమించేందుకు కసరత్తు చేస్తున్నారు. మేజర్ గ్రామ పంచాయతీలకు జిల్లా స్థాయి అధికారులను నియమించనున్నట్లు తెలిసింది. వచ్చే లోక్‌సభ ఎన్నికలపై ఫోకస్ పెడుతున్న కాంగ్రెస్ స్థానిక సంస్థల ఎన్నికలన్నీ పార్లమెంట్ ఎన్నికల తరువాతనే నిర్వహించాలని భావిస్తున్నట్లు తెలిసింది. అప్పటి వరకు ప్రత్యేకాధికారుల పాలన కొనసాగించడానికే మొగ్గు చూపుతోంది. వాస్తవానికి జనవరి నెలాఖరు నాటికి పంచాయతీ పాలక వర్గాల గడువు ముగియనుంది. గతంలో పంచాయతీ ఎన్నికలకు 2019 జనవరి ఒకటో తేదీన నోటిఫికేషన్ ఇచ్చి ఉమ్మడి జిల్లాలో జనవరి 21,25,30 తేదీల్లో ఎన్నికలు నిర్వహించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన అన్ని పంచాయతీల్లో కొత్తపాలకవర్గాలు కొలువుదీరాయి. దీని ప్రకారం ఫిబ్రవరి నెలాఖరులోగా పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. కానీ ఇపుడు ఆ పరిస్థితి కనిపించడం లేదు. అలాగే జూన్‌లో మండల పరిషత్., జిల్లా పరిషత్‌లకు, డిసెంబర్‌లో మున్సిపల్ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే పార్లమెంట్ ఎన్నికల తరువాత వరుసగా స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించాలనే ఆలోచనలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉంది. అలాగే జిల్లాల పునర్ వ్యవస్థీకరణ చేయనున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల ప్రకటించారు. పార్లమెంట్ ఎన్నికల్లోగా ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం వీటికి రాజకీయ అడ్డంకులు ఉండకూడదని భావిస్తోంది. దీంతో తాత్కాలికంగా పంచాయతీ ఎన్నికలను వాయిదా వేసి పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లను నియమించి వారి ద్వారా పథకాలను పకడ్బందీగా అమలు చేయాలని యోచిస్తోంది. పంచాయతీలకు స్పెషల్ ఆఫీసర్లుగా నియమించేందుకు మండల స్థాయి అధికారులు, గెజిటెడ్ అధికారులు, జిల్లాస్థాయి అధికారుల జాబితాను సిద్ధం చేస్తున్నారు. మండల పరిషత్ సూపరింటెండెంట్లు, మండల విద్యాధికారులు, మండల వ్యవసాయాధికారులు,. ఇంజనీరింగ్ విభాగాలకు చెందిన అసిస్టెంట్ ఇంజనీర్లు, డిప్యూటీ తహసీల్దార్ల జాబితాలను సేకరిస్తున్నారు.

పర్సన్ ఇన్‌చార్జ్‌లు లేనట్లే

గత ప్రభుత్వం తీసుకు వచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం-2018 ప్రకారం నిర్ణీత గడువులోగా ఎన్నికలు నిర్వహించాలి. ఏదైనా కారణాల వల్ల అలా సాధ్యం కాని పక్షంలో ప్రత్యేకాధికారులను నియమించి పంచాయతీల్లో పాలన కొనసాగించాలి. పదవీ కాలం పూర్తయిన వారిని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించే అవకాశం కొత్త చట్టంలో లేదు. గతంలో ఎన్నికల నిర్వహణ ఆలస్యమైతే అప్పటి వరకు పదవిలో ఉన్న వారిని పర్సన్ ఇన్‌చార్జ్‌లుగా నియమించి వారి ఆధ్వర్యంలోనే పాలన కొనసాగించేవారు. కానీ 2018 పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత ఈ విధానాన్ని తొలగించారు. గడువులోగా ఎన్నికలు నిర్వహించకపోతే ప్రత్యేకాధికారులను నియమించి వారి ద్వారానే పాలన కొనసాగించాలనే నిబంధన పెట్టారు. ఒకవేళ పర్సన్ ఇన్‌చార్జ్‌లను నియమించాలని కొత్త ప్రభుత్వం అసెంబ్లీలో చట్ట సవరణ చేయాల్సి ఉంటుంది. లేదంటే ఆర్డినెన్స్ తీసుకు రావాలి. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అలాంటి ఆలోచనేదీ చేయడం లేదు. ప్రత్యేకాధికారుల పాలన వైపే మొగ్గు చూపుతోంది.

బీసీల రిజర్వేషన్లు పెంపు!

పదేళ్ల పాటు పంచాయతీల్లో రిజర్వేషన్లు ఉండే విధంగా పంచాయతీరాజ్ చట్టం-2018 రూపొందించారు. ఇప్పటికి దాదాపు అయిదేళ్లు ముగియడంతో అంటే మరో అయిదేళ్ల పాటు పాత రిజర్వేషన్లే కొనసాగే అవకాశం ఉంది. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ వర్గాల వారికి స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ పెంచుతామని హామీ ఇచ్చింది. 42శాతం బీసీ రిజర్వేషన్ పెంచుతామని ఎన్నికల్లో ప్రకటించింది. అలాగే పంచాయతీరాజ్ చట్టం అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్ర వ్యాప్తంగా కొత్త పంచాయతీలు ఏర్పడ్డాయి. దీంతో రిజర్వేషన్లలో మార్పులు చేయడం అనివార్యంగా మారింది. దీని ప్రకారం పంచాయతీరాజ్ చట్టంలో సవరణలు తీసుకువచ్చే అవకాశం ఉంది.

18ఏళ్లు నిండిన వారంతా ఓటరుగా నమోదు కావాలి

- జిల్లా ఎన్నికల అధికారి సి.నారాయణరెడ్డి



వికారాబాద్, జనవరి 18 : 2024 జనవరి 1 నాటికి 18ఏళ్లు నిండినవారంతా ఓటరు జాబితాలో తమ పేరును తప్పక నమోదు చేయించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ సి.నారాయణరెడ్డి గురువారం తెలిపారు. ఈ నెల 20, 21వ తేదీల్లో(శని, ఆదివారం) స్పెషల్ క్యాంపెయిన్ డే నిర్వహిస్తామన్నారు. జనవరి 1, 2024 నాటికి 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు తప్పకుండా ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. బూత్ స్థాయి అధికారులు సంబంధిత పోలింగ్ కేంద్రాల్లో ఓటరు జాబితా, దరఖాస్తు చేసుకునేందుకు గాను 6, 7, 8 నంబరు ఫారాలతో ఉదయం 10గంటల నుంచి అందుబాటులో ఉంటారన్నారు. ఓటరు జాబితాలో పేరు నమోదుతో పాటు సవరణలు, చిరునామా మార్పులు చేర్పులతో పాటు ఇతర క్లెయిమ్‌లు, అభ్యంతరాలపై దరఖాస్తులను స్వీకరిస్తారని ఆయన వివరించారు.



సూర్యనారాయణకు సర్టిఫికెట్ అందజేస్తున్న సూపరింటెండెంట్

117వ సారి రక్తదానం

ఘట్‌కేసర్, జనవరి 18 : ఒకటి కాదు.. రెండు కాదు.. పది కాదు.. ఇప్పటి వరకు ఏకంగా 117 సార్లు రక్తదానం చేసి ప్రాణదాతగా అందరికీ ఆదర్శంగా నిలిచాడు ఘట్‌కేసర్ మున్సిపాలిటీ ఎన్ఎఫ్‌సీనగర్‌కు చెందిన సిస్టా సూర్యనారాయణ(బొట్టు సూరి). గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన ఘట్‌కేసర్‌లోని ప్రభుత్వాసుపత్రి బ్లడ్‌బ్యాంకులో 117వ సారి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరు రక్తదానం చేయాలని కోరారు. రక్తదానం రోగులకు ప్రాణదానంతో సమానం అని తెలిపారు. రక్తదానంపై ప్రతీ ఒక్కరు అవగాహన కలిగి ఉండాలన్నారు. రక్తదాత సూర్యనారాయణకు ఈ సందర్భంగా ఆస్పత్రి కార్యనిర్వహణ అధికారి కోట్యానాయక్ సర్టిఫికెట్ అందజేశారు. కార్యక్రమంలో జగన్‌మోహన్‌రెడ్డి, మహేష్, చంద్రయ్య, సురేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



తాండూరులో సమీక్షిస్తున్న ఆర్డీవో, మైన్స్ ఏడీ, పోలీస్ అధికారులు

ఇసుక అక్రమ రవాణాకు చెక్!

- రూ.600కే నిర్మాణాలకు ట్రాక్టర్ ఇసుక
- ఇసుక లభ్యత కేంద్రాల గుర్తింపు

తాండూరు, జనవరి 18: ఇసుక అక్రమ రవాణా, తవ్వకాల నివారణకు కఠిన చర్యలు తీసుకోవాలని పలుమార్లు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆదేశించడంతో ఈ మేరకు అధికారులు కార్యోన్ముఖులవుతున్నారు. గురువారం పోలీస్, రెవెన్యూ, మైన్స్ అధికారులు సమావేశమై ఇసుక పాలసీ రూపొందించారు. ఇసుక లభ్యత కేంద్రాలను గుర్తించారు. ఆర్డీవో శ్రీనివాస్‌రావు అధ్యక్షతన డీఎస్పీ శేఖర్‌గౌడ్, మైన్స్ ఏడీ జాకబ్, సీఐ రాంబాబు, తహసీల్దార్లు, ఎస్ఐలు ఎంపీడీవోలతో సమీక్షించారు. పాత తాండూరు, వీర్‌శెట్టిపల్లి, ఖాజాపూర్, బషీరాబాద్ మండలం నవాంద్గి, గంగ్వారం, పెద్దేముల్ మండలం రేగొండి, కొండాపూర్ గ్రామాల్లో ఇసుక లభ్యత ఉంటుందని గుర్తించారు. వ్యక్తిగత నిర్మాణాలకు ఇసుక అవసరం ఉన్న వారు రూ.600 డీడీని తహసీల్దార్ కార్యాలయంలో చెల్లించి పంచాయతీ కార్యదర్శి ధ్రువీకరణ పత్రాన్ని జతచేసి అనుమతి పొందాలని పేర్కొన్నారు. ప్రస్తుతం పాత తాండూరు, వీర్‌శెట్టిపల్లి, ఖాజాపూర్, నవాంద్గి, రేగొండి పాయింట్లలో ఇసుక ఇవ్వాలని నిర్ణయించారు. వేబిల్ లేకుండా ఇసుక రవాణా చేసే వాహనాలను సీజ్ చేయాలని, పోలీసులు నిఘా పెంచాలని నిర్ణయించారు.

మేడ్చల్ జిల్లాలో బడి బయటి పిల్లలు 307 మంది

- వారందరినీ స్కూళ్లలో చేర్పించేందుకు కార్యాచరణ

మేడ్చల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కుటుంబ పరిస్థితులు, ఆర్థిక ఇబ్బందులతో పేదపిల్లలు బడికి దూరమవుతున్నారు. పాఠశాల అందుబాటులో లేక కొందరు, పొరుగూళ్ల బడికి పోలేక మరికొందరు బడీడు పిల్లలు చదువుకు దూరమై వ్యవసాయ, ఇతర పనులు చేస్తున్నారు. వీరిలో ప్రధానంగా పది, ఇంటర్మీడియట్ లోపు చదువులను ఆపేసిన వారు ఎక్కువగా ఉన్నారు. ఇలాంటి వారిని తిరిగి బడుల్లో చేర్పించేందుకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు పనిచేస్తున్నాయి. ఇటీవలి ఓ సర్వేలో మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని 15మండలాల్లో 307మంది బడి బయటి పిల్లలు ఉన్నట్లు విద్యాశాఖ అధికారులు గుర్తించారు. ఈ పిల్లలను మళ్లీ బడిబాట పట్టించేందుకు సమగ్ర శిక్ష అభియాన్ నిర్వాహకులు, విద్యాశాఖ అధికారులు 15 మండలాల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. రానున్న విద్యా(2024-25) సంవత్సరానికి సంబంధించి గడిచిన డిసెంబరు, ఈ జనవరి నెలల్లో 6-19ఏళ్ల వయసున్న బడి బయటి పిల్లల సమాచారాన్ని సేకరించారు. ఆయా మండలాల సీఆర్పీలు, ఐఈఆర్పీలు పాఠశాలల్లో సర్వే నిర్వహించారు. ఇల్లు, ఆవాస ప్రాంతాలు, ఇటుక బట్టీలు, కిరాణ దుకాణాలు, హోటళ్లు, క్వారీల వంటి ప్రదేశాలను సందర్శించి వివరాలు నమోదు చేశారు. జిల్లాలో మొత్తం 307మంది బడి బయటి పిల్లలను గుర్తించి తిరిగి ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. చదువులో వెనుకబడిన పిల్లలకు మూడు నెలల బ్రిడ్జి కోర్సులతో శిక్షణ ఇస్తూ వయసుల వారీగా ఆయా తరగతుల్లో చేర్పిస్తారు. అలాగే 15-19ఏళ్ల వయసు వారిని వచ్చే విద్యా సంవత్సరంలో ఓపెన్ స్కూల్ టెన్త్, ఇంటర్మీడియట్‌లో కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఈ నెల 31 వరకు బడి బయటి పిల్లలను గుర్తించే కార్యక్రమం కొనసాగుతుందని విద్యాశాఖ అధికారులు తెలిపారు.



బడి బయటి పిల్లలను గుర్తిస్తున్న అధికారులు

బడీడు పిల్లలందరూ చదువుకునేలా కృషి



బడి బయటి పిల్లలంతా చదువుకునేలా ప్రభుత్వం కృషిచేస్తోంది. చదువుపై విద్యార్థులకు ఆసక్తి కల్పిస్తూ సార్వత్రిక విద్యలో భాగంగా పది, ఇంటర్ పూర్తిచేసుకునే అవకాశాలు కల్పిస్తాం. ఈ అవకాశాలను గ్రామీణ బాలబాలికలు సద్వినియోగం చేసుకోవాలి.

- విజయలక్ష్మి, డీఈవో



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి : కలెక్టర్

మేడ్చల్, జనవరి 18(ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : ఈ నెల 26న కలెక్టరేట్ వద్ద నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన ఏర్పాట్లను అధికారులు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ గౌతమ్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. గణతంత్ర దిన వేడుకల్లో జాతీయతా భావం ఉట్టిపడేలా నిర్వహించాలన్నారు. జాతీయ పతాకావిష్కరణ, పోలీసుల గౌరవ వందనం కార్యక్రమాలు పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో చేపట్టాలన్నారు. కలెక్టరేట్ ఆవరణలోని పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణ అంశాలపై మున్సిపల్ కమిషనర్లకు సూచనలు చేశారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో వేదిక పుష్పాలంకరణతో అందంగా ఉండేలా చూడాలన్నారు. జిల్లా ప్రజాప్రతినిధులు, ముఖ్య అతిథులకు ఆహ్వానపత్రాలను అందజేయాలని సూచించారు. జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు అందించే కార్యక్రమాలను రెవెన్యూ శాఖ పర్యవేక్షించాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే ముసాయిదా కాపీ ఏర్పాట్లను సీపీఓ ఆధ్వర్యంలో తయారు చేయాల్సిందిగా కలెక్టర్ గౌతమ్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ విద్యాశాఖ చేపట్టాలని, వైద్యారోగ్య శాఖ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మందులతో వైద్య శిబిరం ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లు చేసుకోవాలన్నారు. సమావేశంలో డీఆర్వో హరిప్రియ, ఆర్డీఓలు రాజేష్‌కుమార్, శ్యామ్‌ప్రకాష్, కలెక్టరేట్ ఏవో రామ్మోహన్, అధికారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడులకు అన్ని ఏర్పాట్లు చేయాలి : కలెక్టర్

వికారాబాద్ : ఈ నెల 26న నిర్వహించే గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. గురువారం గణతంత్ర దినోత్సవ ఏర్పాట్లపై అధికారులతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే గణతంత్ర దినోత్సవ కార్యక్రమానికి ఏర్పాట్లు చేయడంతో పాటు అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలపై శకటాలు, స్టాళ్లను పెట్టాలన్నారు. ప్రభుత్వ శాఖల ద్వారా లబ్ధిదారులకు అందించే యూనిట్లను ఎగ్జిబిట్ చేయాలన్నారు. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహణకు ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రొటోకాల్ ప్రకారం కార్యక్రమానికి అందరికీ ఆహ్వానాలు అందజేయాలన్నారు. ఉత్తమ సేవలందించిన అధికారులు, ఉద్యోగులకు ప్రశంసాపత్రాలిచ్చేందుకు జాబితాను రూపొందించాలని సూచించారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ లింగ్యానాయక్, వికారాబాద్ ఆర్డీవో విజయ కుమారి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములు మాయం!

- లక్ష్మాపూర్‌లో పట్టా నంబర్లతో రిజిస్ట్రేషన్లు
- రెవెన్యూ అధికారుల కనికట్టు
- భూ మాఫియాతో కుమ్మక్కు
- గ్రామస్తులు ఫిర్యాదు చేసినా పట్టించుకోని వైనం



లక్ష్మాపూర్ గ్రామ వ్యూ

మూడుచింతలపల్లి, జనవరి 18: మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా మూడుచింతలపల్లి మండలంలోని మాజీ సీఎం కేసీఆర్ దత్తత గ్రామం లక్ష్మాపూర్‌లో అసైన్డ్ భూములు అన్యాక్రాంతమవుతున్నాయి. లక్ష్మాపూర్‌నకు సరైన రెవెన్యూ నక్ష లేకపోవడంతో దళారులు, రెవెన్యూ అధికారులకు కాసులవర్షం కురిపిస్తోంది. ప్రభుత్వ భూములను తమ కబంధహస్తాల్లోకి తీసుకొని వారు ఆడిందే ఆట పాడిందే పాటగా దోపిడీ సాగిస్తున్నారు. మూడుచింతలపల్లి మండలాన్ని అప్పట్లో కేసీఆర్ దత్తత తీసుకొని ఎస్‌డీఎఫ్ కింద నిధులు కేటాయించి అభివృద్ధి చేశారు. దీంతో చుట్టుముట్టు గ్రామాల భూములకు ఎకాయకిన ధరల పెరిగాయి. ఇక్కడ రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరందుకుంది. ఇదే అదనుగా దళారులు పథకం ప్రకారం పట్టా, అసైన్డ్ భూములపై కన్నేశారు. పాత రికార్డుల్లో భూమి ఎక్కువగా ఉండి పొజిషన్‌లో లేనివారిని ఎంచుకొని వారిని నయానో భయానో ఒప్పించి ఎంతోకొంత ముట్టజెపుతూ వారి సర్వే నంబరునే అసైన్డ్ భూములకు సైతం వేసి రిజిస్ట్రేషన్లు చేసుకుంటున్నారు.ఈ తతంగమంతా రెవెన్యూ అధికారుల కనుసన్నల్లోనే జరుగుతోందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు.

అసైన్డ్ భూములకు పట్టా ల్యాండ్ నంబర్లతో రిజిస్ట్రేషన్లు

లక్ష్మాపూర్‌లోని సర్వే నంబరు 120లో 1,040 ఎకరాల అటవీ, అసైన్డ్ భూములున్నాయి. ఇందులో 300 ఎకరాల వరకు అసైన్డ్ భూమి. పాత రికార్డుల ప్రకారం భూమి ఎక్కువ ఉండి పొజిషన్‌లో లేనివారిని దళారులు గుర్తించి ఎకరానికి వారికి రూ.10లక్షల నుంచి 12లక్షల చొప్పున ఇచ్చి వారి భూమిని సర్వే నంబరు 120 పక్కనున్న పట్టా నంబరుతో రిజిస్ట్రేషన్ చేయించుకుంటూ పట్టా భూములుగా మార్చుకుంటున్నారు. అనంతరం ఇవే భూములను ఎకరం రూ.50లక్షల నుంచి రూ.70లక్షలు, రోడ్డు బిట్లు కోటికి చొప్పున అమాయకులకు విక్రయిస్తున్నారు. మొత్తానికి అందరూ కలిసి అసైన్డ్, ప్రభుత్వ భూములకు శఠగోపం పెడుతున్నారు. ఇప్పటి వరకు 50ఎకరాల అసైన్డ్ భూమి చేతులు మారింది. ఈ దందా విషయం తెలియక భూమి కొన్న అమాయకులు మోసపోతూ భవిష్యత్తులో ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది.

భూ మాఫియా, రెవెన్యూ అధికారులు కలిసే దందా?

ధరణి పోర్టల్ వచ్చిన తరువాత గ్రామాల్లో భూ సమస్యలు పెరిగాయి. పోర్టల్‌లోని లొసుగులను దళారులు వాడుకుంటూ రెవెన్యూ అధికారులకు లంచాలు ఇస్తూ అసైన్డ్ భూములను అన్యాక్రాంతం చేస్తున్నారు. తమకు పట్టా పాస్‌పుస్తకాలు రాలేదని, రికార్డుల్లో భూ వివరాలు తప్పుగా నమోదయ్యాయని.. వాటిని సరిచేయాలని రైతులు ఏళ్ల తరబడి తహసీల్దార్, ఆర్డీవో, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరిగినా పట్టించుకోలేదని.. ఇప్పుడు ఎక్కడో ఉన్న సర్వే నంబరు తెచ్చి ఈ నంబరు ఇక్కడే వస్తుందని చెప్పగానే అసైన్డ్ భూమిని సైతం పట్టా భూమి సర్వే నంబర్‌తో రెవెన్యూ అధికారులు ఎలా రిజిస్ట్రేషన్ చేస్తున్నారని గ్రామస్తులు ప్రశ్నిస్తూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు కాసులిస్తే ఒక లెక్క.. లేదంటే మరో లెక్కనా? అని అంటున్నారు. ప్రభుత్వ భూములను కాపాడాల్సిన రెవెన్యూ అధికారులే దళారులతో కలిసి భూ దందాకు ఊతం ఇస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఈ తతంగంపై తాము ఉన్నతాధికారులకు ఎన్నోసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు చెబుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించి భూములను అన్యాక్రాంతం చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు, గ్రామస్తులు కోరుతున్నారు.

అసైన్డ్ భూములకు హద్దులను ఏర్పాటు చేయాలి



అధికారులు ఫీల్డ్ విజిట్ చేసి మా గ్రామంలో అసైన్డ్ భుములకు హద్దులు ఏర్పాటు చేయాలి. అలా అయితేనే అసైన్డ్ భూములు ఆక్రమణలకు గురికాకుండా ఉంటాయి. ఇప్పటికే పట్టా భూముల సర్వే నంబర్లతో రిజిస్ట్రేషన్లు చేసిన వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలి. ఉన్న ప్రభుత్వ భూములు గ్రామానికి ఉపయోగపడేలా చూడాలి.

- సింగం రాజు, లక్ష్మాపూర్

అధికారుల చేతివాటంతోనే ఈ దందా



లక్ష్మాపూర్‌లోని అసైన్డ్ భూములన్నీ అధికారుల చేతివాటంతోనే పట్టా భూములుగా మారుతున్నాయి. మా భూ సమస్యలను తీర్చాలని మేం ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదు. కానీ అసైన్డ్ భూములు మాత్రం దళారుల పాలవుతున్నాయి. ఈ మాఫియాకు అన్ని రకాలుగా సహకరిస్తున్న అధికారులపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలి.

- అరుణ్, లక్ష్మాపూర్

మా దృష్టికి రాలేదు.. ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటాం



లక్ష్మాపూర్‌లో అసైన్డ్ భూములు అన్యాక్రాంతం అవుతున్నాయనే విషయం మా దృష్టికి రాలేదు. దీనిపై గ్రామస్తులు మాకు ఫిర్యాదే చేయలేదు. ఇప్పటికైనా ఫిర్యాదు చేస్తే ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. పాత రికార్డుల ప్రకారం అసైన్డ్ భూములకు హద్దులు నిర్ణయిస్తాం. దీంతో ఎక్కడెక్కడ అసైన్డ్ భూములున్నాయో నిర్ధారణ అవుతుంది. అప్పుడు అసైన్డ్ భూములను అమ్మిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటాం.

- వాణిరెడ్డి, తహసీల్దార్, మూడుచింతలపల్లి

● **తాండూరు రూరల్:** రేపు(శనివారం) తాండూరు మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

రైతులు అధికారుల సూచనలు పాటించాలి


కొత్తపల్లిలో సాగు చేసిన పంటను పరిశీలిస్తున్న డీఏవో గోపాల్

కులకచర్ల, జనవరి 18: యాసంగి సీజన్ పంటల సాగులో రైతులు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ వికారాబాద్ జిల్లా అధికారి గోపాల్ తెలిపారు. చౌడాపూర్ మండలంలోని కొత్తపల్లి గ్రామంలో గురువారం ఆన్‌లైన్‌లో నమోదు చేసిన పంటల ప్రక్రియను పరిశీలించారు. సర్వేనెంబర్ ఆధారంగా ఆన్‌లైన్‌లో పొందుపర్చి సాగు చేసిన పంటలను పరిశీలించి సూచనలు చేశారు. యాసంగిలో సాగు చేస్తున్న పంటలను రైతులు వ్యవసాయ విస్తరణ అధికారుల దగ్గర సర్వే నెంబర్ ప్రకారం నమోదు చేసుకోవాలన్నారు. సిల్క్ ఫార్మింగ్ చేస్తున్న రైతు గోపాల్ మల్బరీ తోటను పరిశీలించి తగు సూచనలు చేశారు. వరి పంటలో మోగిపురుగు, చీడ పురుగులు తగలకుండా ముందు జాగ్రత్త చర్యగా వరి నారు మడుల్లో తగినంత కార్బోఫ్యూరన్ గుళికలు చల్లుకోవాలని సూచించారు. చలి తీవ్రత నుంచి వరి నారును కాపాడుకునేందుకు తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు విశ్వనాథ్, భావన, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

36మంది బాల కార్మికులకు విముక్తి


వివరాలు వెల్లడిస్తున్న అధికారులు

తాండూరు రూరల్, జనవరి 18: తాండూరు ప్రాంతంలో వివిధ చోట్ల పనిచేస్తున్న 36మంది బాల కార్మికులకు జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ అధికారులు విముక్తి కల్పించారు. ఆపరేషన్ స్మైల్‌లో భాగంగా గురువారం తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో బాల కార్మికుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేష్ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జనవరి 1వ తేదీ నుంచి 31వరకు ఆపరేషన్ స్మైల్-10 కార్యక్రమం నిర్వహిస్తున్నామని చెప్పారు. తాండూరులో వివిధ చోట్ల పని చేస్తున్న 36మంది బాల కార్మికులకు విముక్తి కల్పించినట్లు తెలిపారు. పనిలో పెట్టుకున్న ఏడుగురు యజమమానులపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బాల కార్మికులను పనిలో నుంచి విముక్తి కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. తల్లిదండ్రుల కోరిక మేరకు వారిని చదివిస్తామన్నారు. ఎవరైనా పనిలో పెట్టుకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో లేబర్ ఆఫీసర్ సంతోష్‌రెడ్డి, నరేష్ పాల్గొన్నారు.

ఇళ్ల మధ్య సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలి


ఘట్‌కేసర్, జనవరి 18: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ పరిధిలోని ఎన్‌ఎఫ్‌సీనగర్‌లో ఇళ్లమధ్య ప్రైవేట్ పాఠశాల భవనంపై నిర్మిస్తున్న సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని కాలనీవాసులు గురువారం జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. పాఠశాలలు, జనావాసాల నడుమ సెల్ టవర్ల నిర్మాణం జరుగకుండా చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో కోరారు. సెల్‌టవర్ నిర్మాణంతో రేడియేషన్ సమస్యలు తలెత్తి పిల్లల ఆరోగ్యాలపై ప్రభావం చూపే ప్రమాదముందని ఫిర్యాదులో పేర్కొన్నారు. పక్కనే కేంద్రీయ విద్యాలయం ఉన్నదని, ఇక్కడ దాదాపు 1400మంది విద్యార్థులు చదువుకుంటున్నారన్నారు. అందరికీ ఇబ్బందిగా ఉన్నందున చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ నిబంధనలకు విరుద్ధంగా పాఠశాలను నిర్వహిస్తున్నారని ఈవిషయమై పూర్తి స్థాయి విచారణ జరిపి సెల్‌టవర్ నిర్మాణం జరుగకుండా చర్యలు చేపట్టాలని మల్లేష్, రవి, లోకేష్, విజయ్, బంగారుబాబు, మణేమ్మ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు.

తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి


జినుగుర్తి శివారులో బోరు పనులు ప్రారంభిస్తున్న జడ్పీటీసీ గౌడి మంజుల


తాండూరు రూరల్, జనవరి 18:మండలంలోని బిజ్వార్, గోనూరు, ఉద్దండాపూర్, జినుగుర్తిలో రెండు, చెంగోల్, చింతామణిపట్నం, గౌతాపూర్, అంతారం తండాలో రెండు, తాండూరు మండల పరిషత్ కార్యాలయంలో ఒక్కొక్కటి చొప్పున 11 బోర్లను మంజూరు చేసినట్లు జడ్పీటీసీ తెలిపారు. తాగునీటి ఎద్దడి నివారణకు బోర్లు వేయించిన జడ్పీ చైర్‌పర్సన్‌కు మంజుల కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు, మహిళలు పాల్గొన్నారు.

మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు పంపిణీ


పటేల్ చెరువు తండాలో మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ, జడ్పీటీసీ

కులకచర్ల, జనవరి 18: గిరిజన మహిళలకు స్వచ్ఛంద సంస్థలు ఉచిత కుట్టు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జడ్పీటీసీ రాందాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని పటేల్ చెరువు తండాలో సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ స్వచ్ఛంద సంస్థ, ఉష ఇంటర్నేషనల్ లిమిటెడ్ సంస్థ కలిసి గిరిజన మహిళలకు రెసిడెన్షియల్ టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. గురువారం శిక్షణ పూర్తయిన 15మంది మహిళలకు వారు కుట్టు మిషన్‌లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డీటీడీవో కోటాజీ, సర్పంచ్ శాంతి తదితరులు పాల్గొన్నారు.

పన్ను వసూళ్లను పూర్తి చేయాలి



మాట్లాడుతున్న నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్

కీసర రూరల్, జనవరి 18: లక్ష్యం మేరకు పన్నులు వసూలు చేయాలని నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేందర్‌కుమార్ అన్నారు. మున్సిపల్ సమావేశ మందిరంలో గురువారం పన్నుల వసూళ్లపైబిల్ కలెక్టర్లతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగియనున్నందున పన్నుల వసూళ్లలో నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఇంటి పన్నులు, ట్రేడ్ లైసెన్స్ ఫీజులు పూర్తిస్థాయిలో వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకోవాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ చంద్రశేఖర్, సానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి, బిల్ కలెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యం


పాడి రైతులకు దాణా పంపిణీ చేస్తున్న వీరాపూర్‌లో హెరిటేజ్ నిర్వాహకులు

కులకచర్ల, జనవరి 18: పాడి రైతుల సంక్షేమమే హెరిటేజ్ లక్ష్యమని, రుణాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని హెరిటేజ్ రీజినల్ హెడ్ సర్వోత్తమ్‌రెడ్డి తెలిపారు. చౌడాపూర్ మండలంలోని వీరాపూర్ గ్రామంలో గురువారం పాడి రైతులకు అవగాహన సదస్సు నిర్వహించి మాట్లాడారు. హెరిటేజ్ ఫుడ్స్ లిమిటెడ్ అందిస్తున్న రైతు రుణాలను రైతులు వినియోగించుకోవాలన్నారు. పశువులకు కావాల్సిన పోషక విలువలతో కూడిన పశువుల దాణాను వినియోగించుకొని నాణ్యమైన పాలఉత్పత్తిని పొందవచ్చన్నారు. తమ సంస్థ ద్వారా ప్రతీ పాడిరైతుకు రూ.2లక్షల ఉచిత ప్రమాద బీమా కల్పిస్తున్నామన్నారు. గ్రామంలో ప్రమాదవశాత్తు గాయపడిన పాడి రైతు చంద్రకాంత్‌రెడ్డికి రూ.50వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్లాంట్ మేనేజర్ రాజేందర్‌రెడ్డి, పర్యవేక్షణ అధికారి వజ్రలింగం, వెటర్నరీ అసిస్టెంట్ రమేశ్, పాల సేకరణ ప్రతినిధులు శ్రీనివాస్‌రెడ్డి, చంద్రకాంత్ రెడ్డి, ఆనంద్‌రెడ్డి, పాడి రైతులు పాల్గొన్నారు.

యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో ప్రతిభ


ఓంకార్‌గౌడ్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: మండలంలోని కాచవానిసింగారంకు చెందిన మట్ట ఓంకార్‌గౌడ్ నగరంలోని సీసీఎంబీలో నిర్వహించే యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. హైదరాబాద్ సెంటర్ ఫర్ సెల్యూలర్ అండ్ మాలిక్యూలర్(సీసీఎంబీ) ఆధ్వర్యంలో ఏటా తెలంగాణ వ్యాప్తంగా 300మంది విద్యార్థులు చేసుకోగా రాతపరీక్ష ద్వారా 27 మందిని ఎంపికచేశారు. అందులో కాచవానిసింగారం, దివ్యనగర్‌లోని నల్ల మల్లారెడ్డి ఫౌండేషన్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న మట్ట ఓంకార్‌గౌడ్ ఎంపికై ప్రతిభ కనబరిచాడు. ఈ కార్యక్రమంలో ఓంకార్‌గౌడ్ యంగ్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రాంలో పరిశోధనల పట్ల ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో సీసీఎంబీ హైదరాబాద్ డైరెక్టర్ వినయ్ ప్రశంసాపత్రాన్ని అందజేశారు.

అంతర్గత రోడ్లకు మహర్దశ


లగచర్లలో అంతర్గత రోడ్లకు అంచనాలు సిద్ధం చేస్తున్న పంచాయతీ రాజ్ అధికారులు

బొంరాస్‌పేట్, జనవరి 18: గ్రామీణ ప్రాంతాలకు మహర్దశ పట్టనుంది. సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం మండలంలోని వివిధ గ్రామాలకు అంతర్గత అనుసంధాన రోడ్లకు పంచాయతీ రాజ్ అధికారులు అంచనాలు సిద్ధం చేశారు. దుద్యాల మండలంలోని లగచర్ల గ్రామంలో గురువారం అంతర్గత రోడ్లు, అనుసంధాన రోడ్లపై సర్వేలు నిర్వహించి నివేదికలు సిద్ధం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శేఖర్, వివిధ గ్రామాల నాయకులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

తెలంగాణ టీచర్స్ యూనియన్ క్యాలెండర్ ఆవిష్కరణ


క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న డీఈవో రేణుకాదేవి

వికారాబాద్, జనవరి 18 : తెలంగాణ టీచర్స్ యూనియన్ జిల్లా శాఖ క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా విద్యాధికారి రేణుకాదేవి చేతుల మీదుగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దత్తాత్రేయరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రాములు, రాష్ట్ర కార్యదర్శి లక్ష్మయ్య, జిల్లా కార్యదర్శులు విఠల్ రెడ్డి, మోహన్ రెడ్డి మోమిన్ పేట మండల శాఖ అధ్యక్షులు గోపాల్ తదితరులు పాల్గొన్నారు.


దుబాయ్ విహారయాత్రలో ఎమ్మెల్యేతో పాటు బీఆర్ఎస్ నేతలు

ఎమ్మెల్యే మల్లారెడ్డి దుబాయ్ టూర్

మేడ్చల్ టౌన్, జనవరి 18: మేడ్చల్ మున్సిపల్ బీఆర్ఎస్ నేతలతో కలిసి మాజీ మంత్రి, ఎమ్మెల్యే మల్లారెడ్డి వెళ్లిన దుబాయ్ టూర్ వెళ్లిన సంగతి తెలిసిందే. ఇందుకు సంబంధించిన ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. ఎమ్మెల్యే మల్లారెడ్డితో పాటు కౌన్సిలర్లు, మహిళా కౌన్సిలర్ల భర్తలు దుబాయ్‌లో ఆయా ప్రాంతాలను వీక్షిస్తున్న ఫోటోలు వైరల్ అవుతున్నాయి. తెలంగాణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం దుబాయ్ వెళ్లి జీవనోపాధి పొందుతున్న కార్మికులతో మల్లారెడ్డి మాట్లాడి వారి జీవన స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. దీనికి తోడు దుబాయ్‌లోని ఎత్తైన భవనాలపై నిలబడి గుడ్ లక్ చెబుతున్న ఫొటోలు వైరల్‌గా మారాయి.

ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలి


మాట్లాడుతున్న సూరజ్‌కుమార్

కందుకూరు, జనవరి 18: ఈ నెల 22 వరకు ప్రతీఒక్కరు ఓటు నమోదు చేసుకోవాలని ఆర్డీవో సూరజ్ కుమార్ సూచించారు. మహేశ్వరం నియోజకవర్గంలో 13వేల బోగస్ ఓట్ల తొలగింపునకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గురువారం మండల కేంద్రంలో ఆర్డీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈనెల 6నుంచి 22 వరకు కొత్త ఓటు హక్కు కొరకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. నియోజకవర్గం పరిధిలో 18 ఏళ్ల నిండినవారు 2.6శాతం మంది ఓటు నమోదు చేసుకున్నట్లు తెలిపారు. ఇప్పటి వరకు 5లక్షల 50వేల 141మంది ఓటర్లు ఉండగా.. 13వేల మంది ఓటర్లు రెండు నుంచి ఐదు పోలింగ్ కేంద్రాల్లో ఓటు కలిగి ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు వారికి తపాల కార్యాలయం ద్వారా నోటీసులు పంపుతున్నట్లు తెలిపారు. త్వరలో వారు తమకు ఎక్కడ ఓటు ఉండాలో తెలియజేయాలని, లేని పక్షంలో ఎన్నికల సంఘం ఆదేశానుసారం తదుపరి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. కాగా, గత శాసనసభ ఎన్నికల్లో నియోజకవర్గం పరిధిలో 10వేల మంది ఓటర్లు మరణించిన వారి పేర్లు ఓటరు లిస్టుల్లో వచ్చాయని, వాటిని తొలగించడానికి బీఎల్వోలు నివేదిక ఇవ్వాలని కోరారు. నియోజకవర్గంలో ఇప్పటి వరకు ఉన్న 541 పోలింగ్ కేంద్రాలు ఉన్నట్లు తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల వరకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో కొత్త ఓటర్ల పేర్లు నమోదు చేసుకోవడానికి అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో కందుకూరు తహసీల్దార్ కె.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యాధికారులు సమయపాలన పాటించాలి


వైద్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్

చేవెళ్ల, జనవరి 18 : వైద్యాధికారులు సమయపాలన పాటించాలని లేదంటే కఠినచర్యలు తప్పవని డిప్యూటీ డీఎంహెచ్‌వో దామోదర్ హెచ్చరించారు. గురువారం చేవెళ్లలో వైద్యాధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతల విషయంలో సంరక్షణ, పర్యవేక్షణ చేయాలన్నారు. శిశు పోషణ, రక్షణలో భాగంగా సకాలంలో టీకాల నిర్వహణ, ఫిర్యాదులు వస్తే ఇంటింటి సర్వే చేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పులు ఎక్కువగా జరిగేవిధంగా చూడాలన్నారు. సమయపాలన పాటించని వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. సమావేశంలో సిహెచ్‌వోలు సంతోష, గోపాల్‌రెడ్డి, సుదర్శన్, బలరాం వైద్యులు, వైద్య సిబ్బంది ఉన్నారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలని ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శికి వినతి


స్మితా సబర్వాల్‌ను సన్మానిస్తున్న సర్పంచ్ మంజుల మల్లేష్

కేశంపేట, జనవరి 18: గ్రామ పంచాయతీల పెండింగ్ బిల్లులు చెల్లించాలని వేముల్‌నర్వ సర్పంచ్ కటికే మంజుల మల్లేష్ ఫైనాన్స్ కమిషన్ కార్యదర్శి స్మితా సబర్వాల్‌ను కలిసి వినతిపత్రం అందించారు. గురువారం హైదరాబాద్‌లోని ఫైనాన్స్ కమిషన్ కార్యాలయంలో ఆమెను కలిశారు. గత ప్రభుత్వంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనుల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని, చాలా కాలంగా ప్రభుత్వం బిల్లులు చెల్లించక పోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు ఆమెకు చెప్పారు. గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారంతో పాటు పెడింగ్ బిల్లులు చెల్లించాలని కోరారు. స్మితా సబర్వాల్ సానుకూలంగా స్పందించారని సర్పంచ్ చెప్పారు.

ఆలయంలో ఎంపీపీ శ్రమదానం


శ్రీ ఉమామహేశ్వరాలయంలో శ్రమధానం చేస్తున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: అయోధ్య రామమందిరంలో సీతారాముల విగ్రహాల ప్రాణప్రతిష్ఠాపన సందర్భంగా ప్రధాని మోదీ పిలుపు మేరకు గురువారం ఎంపీపీ సుదర్శన్ రెడ్డి అవుషాపూర్‌లోని ఉమామహేశ్వరాలయంలో శ్రమదానం చేశారు. స్థానిక నాయకులతో కలిసి ఎంపీపీ ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ఈనెల 22వ తేదీన అయోధ్య రామమందిరంలో జరిగే ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామాల్లోని ఆలయాలను, ఇళ్లను శుభ్రం చేసుకోవాలని సూచించారు. ఆరోజు ప్రతీ ఇంట్లో ఐదు దీపాలను వెలిగించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు మశ్చేందర్‌రెడ్డి, వెంకటేష్, సంతోష్, ఆలయ పూజారి సాకేత్‌శర్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం

మూడుచింతలపల్లి, జనవరి 18: అభివృద్ధి పనులకు ప్రణాళిక సిద్ధం చేసినట్లు సర్పంచ్ జాము రవి తెలిపారు. గ్రామంలో గురువారం గ్రామ పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాన్ని(జీపీడీపీ) నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 2024- 2025 సంవత్సరానికి వార్షిక బడ్జెట్ ఏర్పాటు చేసి గ్రామంలో సీసీరోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు తదితర అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికను సిద్ధం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ వెంకట్ రమణరెడ్డి, వార్డు సభ్యులు, పంచాయితీ కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న సర్పంచ్ జాము రవి

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు


స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు


కల్యాణోత్సవంలో పాల్గొన్న దంపతులు

కొందుర్గు, జనవరి, 18: మండల పరిధిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు గురువారం ముగిసాయి. సంక్రాంతి రోజు ప్రారంభమైన శ్రీ వేంకటేశ్వర స్వామి బ్రహోత్సవాలు చివరి రోజైన గురువారం ఉదయం 5గంటలకు సుప్రభాతం, 5.30కు విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణం, 8గంటలకు స్వామి వారికి అభిషేకం చేశారు. 11 గంటలకు స్వామి వారి కల్యాణోత్సవాన్ని కమణీయంగా పూజారులు విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవంలో చెక్కల గోవింద, శ్రీనివాస్ గౌడ్‌ర, నర్సింహులు, రాజశేఖర్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు. అన్నదానం చేసిన నర్సింహులు దంపతులను దేవస్థాన కమిటీ ఛైర్మన్ రామకృష్ణ శాలువాతో సన్మానించారు. నాలుగు రోజుల పాటు నిర్వహించిన బ్రహోత్సవాల్లో.. వెంకిర్యాల, కొందుర్గు, విశ్వనాథ్‌పూర్, గంగన్నగూడ, చెర్కుపల్లి, కొత్త ఆగిర్యాల, పాత అగిర్యాల, తంగళ్లపల్లి, జిల్లెడ్-చౌదరిగూడ మండల పరిధిలోని కాస్లాబాద్, రావిర్యాల, ఎదిర, జాకారం, గుంజల్‌పహడ్, చలివేంద్రంపల్లి, పీర్హాపూర్, వెంకిర్యాల తాండ, కాస్లాబాద్ తాండ, నవాబ్‌పేట్ మండల పరిధిలోని కొల్లూరు గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

44 కిలోల గంజాయి పట్టివేత


పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు

శంకర్‌పల్లి, జనవరి 18 : గంజాయిని తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు మోకిల సీఐ వీరబాబు తెలిపారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఇంద్రారెడ్డినగర్ ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్డులో ముగ్గురు వ్యక్తుల వద్ద గంజాయి ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. బుధవారం ఉదయం సర్వీస్ రోడ్డులో ఉన్న వ్యక్తులను తనిఖీ చేయగా వారివద్ద ఉన్న సంచుల్లో బ్రౌన్ కలర్ పార్సిల్ ప్యాకెట్లు లభించాయి. వాటిని పరిశీలించగా అందులో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. నిందితులు గజానంద్ సుభాష్, గోవింద్ ధారాసింగ్, శిల్పా గజానంద్‌ను అదుపులోకి తీసుకొని వారి నుంచి 44 కేజీల గంజాయిని సీజ్ చేశారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మనసు చూరగొంటున్న మాస్టారు

14ఏళ్లలో 18 సెలవులే..

- ఒక్క విద్యార్థీ ఇతర పాఠశాలకు వెళ్తే ఒట్టు
- ప్రైవేట్‌కు దీటుగా విద్యాబోధన
- ఇంగ్లీష్‌లో అనర్గళంగా మాట్లాడుతున్న విద్యార్థులు

మారిన ప్రభుత్వ పాఠశాల రూపురేఖలు


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్

పూడూరు, జనవరి 18: పుట్టగొడుగుల్లా ప్రైవేటు పాఠశాలలు వెలుస్తుండడంతో గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడే పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. ఉపాధ్యాయులను నియమించకపోవడంతో తమ పిల్లల భవిష్యత్ ఏమవుతుందోనని తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పిస్తున్నారు. దీంతో సరిపడా విద్యార్థులు లేరనే కారణంతో పాఠశాలలను మూసివేయాల్సివస్తోంది. అయితే, వికారాబాద్ జిల్లా పూడూరు మండల పరిధిలోని మేడిపల్లికలాన్ పాఠశాల మాత్రం అందుకు భిన్నమనే చెప్పాలి. ఒకే ఒక్క ఉపాధ్యాయుడు ఆ పాఠశాల రూపురేఖలనే మార్చాడు. ఆ గ్రామం నుంచి ఏ ఒక్క విద్యార్థి కూడా ప్రైవేటుకు వెళ్లడంటే నమ్మశక్యం కాదేమో. కానీ ఇదే నిజం. ఈ పాఠశాలలో ఒకప్పుడు విద్యార్థుల సంఖ్య పెద్దగా లేకపోవడంతో పాటు మౌలిక సదుపాయాలు లేక మూతబడే స్థితికి వచ్చింది. ఇదేక్రమంలో ఈ పాఠశాలకు ఇంగ్లీష్ ఉపాధ్యాయుడిగా నియమితులైన ఖాజామైనుద్దీన్ రాకతో పాఠశాల జీవం పోసుకుంది. బడిబాట పేరుతో 'ప్రైవేట్ పాఠశాల వద్దు.. ప్రభుత్వ పాఠశాల ముద్దు' అనే నినాదంతో తల్లిదండ్రుల ఆలోచనను ఆయన మార్చేశారు. గతంలో 60 మంది విద్యార్థులున్న ఈ పాఠశాలలో ప్రస్తుతం 130మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఖాజామైనుద్దీన్ తన ఉపాధ్యాయ బృందంతో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించడం, అవగాహన కార్యక్రమాలు వంటి కార్యక్రమాలు ఏర్పాటు చేసి ఉత్తమ సేవలందిస్తున్నారు. ప్రతీ విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. అంతేకాదు.. ఈ పాఠశాల విద్యార్థులు ఇంగ్లీష్‌లో గడగడా మాట్లాడే విధానం చూస్తే ఎవరైనా ఆశ్చర్యపోవాల్సిందే. ఇక్కడి విద్యార్థులు ఐఐటీ, నీట్ వంటి వాటిలో సత్తా చాటుతున్నారు. ఇదంతా కేవలం హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్ వల్లేనని గ్రామస్తులు చెబుతున్నారు. 2010 నవంబర్ 4న ఈ పాఠశాలలో జాయిన్ అయిన హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్ 2016లో మండల ఉత్తమ ఉపాధ్యాయులుగా, 2020లో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు అందుకున్నారు.


గతంలో ఖాజామైనుద్దీన్ బదిలీ కావడంతో కలెక్టరేట్ ఎదుట ప్లకార్డులతో ధర్నా చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

14ఏళ్లలో 18 సెలవులే

పాఠశాలలో చదివే విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆలోచించే ఖాజామైనుద్దీన్ 14ఏళ్ల తన సర్వీసులో కేవలం 18సెలవులు మాత్రమే తీసుకున్నారంటే ఆయన వృత్తిపై ఎంత నిబద్ధతతో ఉంటారో అర్థం చేసుకోవచ్చు. ఆ 18 రోజులు కూడా అత్యవసరం అయితేనే సెలవు పెట్టారు. ముఖ్యంగా 2018 నుంచి ఇప్పటి వరకు ఒక్కసెలవు తీసుకోకపోవడం విశేషం. తన వ్యక్తిగత విషయాల కోసం పిల్లల భవిష్యత్తుకు ఇబ్బంది కలగొద్దని సెలవులు పెట్టనని ఆయన చెబుతున్నారు.

మా సార్‌ను బదిలీ చేయొద్దు

గత ప్రభుత్వ హయాంలో టీచర్ల బదిలీల్లో భాగంగా ప్రభుత్వం ఖాజీమైనుద్దీన్ కూడా బదిలీచేసింది. పాఠశాల విద్యార్థులు తమ హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్ బదిలీని తట్టుకోలేక ధర్నాకు దిగారు. మా సార్‌ను వేరే ఊరికి బదిలీ చేయొద్దంటూ విద్యార్థులు, మేడిపల్లి గ్రామస్తులు పట్టుబట్టారు. అంతేకాకుండా ఒకరోజు విద్యార్థులు తరగతులు బహిష్కరించి మా సార్‌ను బదిలీ చేయొద్దంటూ ప్లకార్డులతో కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ధర్నా చేశారు. విద్యార్థులతో పాటు తల్లిదండ్రులు హెచ్‌ఎం ఖాజామైనుద్దీన్‌ను బదిలీ చేయొద్దని కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ ఘటనలు గతంలో సంచలనంగా మారాయి. అయితే అప్పట్లో కొన్ని కారణాల వల్ల బదిలీలు రద్దు కావడంతో ఖాజామైనుద్దీన్ ఇక్కడే కొనసాగుతున్నారు. ఇప్పటికీ విద్యార్థులు, గ్రామస్తులు ఆయన బదిలీ అయితే ఊరుకోమని పేర్కొనడం గమనార్హం.

మాసార్ మాకోసం సెలవు తీసుకోరు



మేమంతా ఎంతో ఇష్టంగా పాఠశాలకు వెళుతున్నాం. మా హెచ్‌ఎం ఖాజీమైనుద్దీన్ సార్ మా చదువు కోసం చాలా శ్రద్ధ తీసుకుంటారు. మాకోసం ఒక్కరోజు కూడా సెలవు పెట్టకుండా పాఠశాలకు వస్తారు. మా సార్‌ను ఇతర పాఠశాలకు బదిలీ చేస్తే ఒప్పుకోం. నేను బాగా చదువుకుని పెద్దయ్యాక డాక్టర్ అవుతా. మా గురువుల పేర్లు, మా తల్లిదండ్రుల పేరు నిలబెడతా.

బి.సుకీర్తన, ఎం.పి.అప్పర్, ప్రైమరీ స్కూల్, మేడిపల్లికలాన్

చదువులో మా పిల్లలు ఎంతో మెరుగయ్యారు



మా పాపను గతంలో శంషాబాద్‌లోని సెయింట్‌మేరీ స్కూల్‌లో చేర్పించాను. కానీ ఖాజామైనుద్దీన్ సార్ మా ఇంటికి వచ్చి మాట్లాడారు. మా పాప భానుప్రియను, అలాగే నా కొడుకును కూడా మా ఊరి ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాను. చదువులో మాపిల్లలు ఎంతో మెరుగుపడ్డారు. ఇదంతా ఖాజామైనుద్దీన్ సార్ కృషి. మూతబడుతుందనుకున్న పాఠశాలను మంచి స్థాయికి తీసుకువచ్చారు.

స్వరూప, విద్యార్థి తల్లి, మేడిపల్లికలాన్

సార్ వచ్చాక ఎన్నో మార్పులు



మా గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలకు హెచ్‌ఎం ఖాజా మైనుద్దీన్ సార్ వచ్చాక చాలా మార్పులు చేశారు. గ్రామంలో ప్రజలతో మాట్లాడి సమావేశాలు నిర్వహించి బడిబాట కార్యక్రమాలు చేశారు. గ్రామంలో పూర్తిగా మార్పు వచ్చింది. మా గ్రామం నుంచి పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించడం లేదు. ఇప్పుడు నాణ్యమైన విద్య అందుతోంది. ఆయన వచ్చాక పిల్లలను ప్రైవేట్‌లో చేర్పించాల్సిన అవసరం లేకుండా పోయింది.

రవికుమార్, ఎస్ఎంసీ చైర్మన్

నా గురువులే స్ఫూర్తి



నేను మేడిపల్లికలాన్ గ్రామానికి వచ్చి దాదాపు 14ఏళ్లు అవుతుంది. అప్పుడు కూడా నేను మా సొంత గ్రామానికి వచ్చినట్లే అనిపించింది. నా గురువులే నాకు స్ఫూర్తి. వారు నేర్పిన శిక్షణ, సంస్కారాన్ని పిల్లలకు నేర్పాలి అనుకున్నా. అప్పటికీ, ఇప్పటికీ ప్రభుత్వం విద్యావ్యవస్థలో అనేక మార్పులు వచ్చాయి. పిల్లల తల్లిదండ్రులకు, గ్రామప్రజలకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తున్నాం. నాలక్ష్యం తోటి ఉపాధ్యాయ బృందం, గ్రామ ప్రజల సహకారంతోనే సాధ్యమైంది.

ఖాజామైనుద్దీన్, హెచ్‌ఎం, ఎంపీ అప్పర్ ప్రైమరీ స్కూల్, మేడిపల్లికలాన్

బీఆర్ఎస్ ప్రజాధనాన్ని లూటీ చేసింది

- కాంగ్రెస్‌తోనే పేదలకు సంక్షేమ పథకాలు
- తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి


మట్లాడుతున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

బషీరాబాద్, జనవరి 18: బీఆర్ఎస్ హయాంలో అభివృద్ధి, సంక్షేమం పేరిట ప్రజా ధనాన్ని లూటీ చేసిందని తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఆరోపించారు. ఊరురా కాంగ్రెస్ జెండా పండుగ కార్యక్రమంలో భాగంగా బషీరాబాద్ మండలం ఇస్మాయిల్‌పూర్, నీళ్లపల్లి, జలాల్‌పూర్, మర్పల్లి, పర్వత్‌పల్లి, హంక్యానాయక్‌తండా, భోజ్యానాయక్‌తండా, నవాల్ల తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులతో కలిసి కాంగ్రెస్ పార్టీ జెండాలను ఆవిష్కరించారు. ఎమ్మెల్యేను ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు శాలువా కప్పి సత్కరించారు. అంతకు ముందు నీళ్లపల్లి ఏకాంబర రామలింగేశ్వరాలయంలో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ గడిచిన పదేళ్లలో మోసపూరిత పాలన సాగిస్తూ అడుగడుగునా ప్రజలకు అన్యాయం చేసిందన్నారు. ఇబ్బడి ముబ్బడిగా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చిందని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలో ఉంటేనే పేదలకు మేలు జరుగుతుందన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ 2లక్షల ఉద్యోగాలు కల్పిస్తామని చెప్పిందని, ఆదిశగా సీఎం చర్యలు చేపట్టారన్నారు. కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను కూడా నిర్ణీత వ్యవధిలో అమలు చేస్తామని చెప్పారు. ఇందులో రెండు గ్యారంటీలు ఇప్పటికే అమలు చేస్తున్నామని చెప్పారు. ఫిబ్రవరిలో తాండూరులో మెగా జాబ్‌మేళా ఏర్పాటు చేయనున్నట్లు ఎమ్మెల్యే వెల్లడించారు. రాబోయే ఎంపీ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామాలకు వస్తారని, మాయమాటలు నమ్మి మోసపోకుండా మరోసారి ఊరురా కాంగ్రెస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. త్వరలో తాండూరులో ఐటీఐ కళాశాల ప్రారంభించనున్నట్లు తెలిపారు. అదే విధంగా గిరిజన తండాల్లో మౌలిక సదుపాయల కల్పనకు తనవంతుగా కృషి చేస్తానన్నారు. ప్రతీ ఊరికి రూ.4 నుంచి 5లక్షల నిధులు కేటాయిస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ శ్రీనివాస్ రెడ్డి, నవాంద్గీ పీఏసీఎస్ వైస్‌చైర్మన్ అజయ్‌ప్రసాద్, పార్టీ సీనియర్ నేతలు ఎస్.వెంకటేష్‌మహరాజ్, రామునాయక్, ఎం.శ్రీనివాస్, పార్టీ మండల అధ్యక్షుడు కలాల్ నర్సింహులు గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మణ్‌రావు, సర్పంచులు శాంతి, విష్ణువర్ధన్‌రెడ్డి, దేవ్‌సింగ్, సూర్యానాయక్, లాలప్ప, గోళ్లభీమప్ప, సుభాష్ పాల్గొన్నారు.

తాండూరులో అయోధ్య ఉత్సవాలు

- 22న సీతారాముల కల్యాణోత్సవం
- గోశాల సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాట్లు
- మూడు రోజులు ప్రత్యేక పూజలు
- హాజరుకానున్న ప్రముఖులు

తాండూరు, జనవరి 18: అయోధ్య రామ మందిరం ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని తాండూరు గోశాల సేవా సమితి ఆధ్వర్యంలో అయోధ్య ఉత్సవాలను భారీఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈనెల 22వ తేదీన తాండూరులో వ్యాపార, వాణిజ్య విద్యాసంస్థలు, వంటి వాటి సైతం స్వచ్ఛందంగా బంద్ పాటించేలా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. కనీవినీ ఎరుగని రీతిలో మూడు రోజుల పాటు తాండూరులో ఈ ఉత్సవాలను నిర్వహించనున్నారు. ఇప్పటికే తాండూరు పట్టణంలో రాముడి బొమ్మతో కూడిన స్వాగత తోరణాలు, బ్యానర్లు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లను ఏర్పాటు చేసి విస్తృత ప్రచారం చేపట్టారు. మొదటి రోజు 22వ తేదీన ఉదయం 9 గంటలకు గోపూజ, వినాయక పూజ, 10 గంటలకు రాముల వారి అభిషేకం, ఉదయం 11 గంటల నుంచి గోశాల ఆవరణలో సీతారాముల కల్యాణోత్సవం, భజన కార్యక్రమం ఏర్పాటు చేశారు. 23న సాయంత్రం 5 గంటల నుంచి స్టేషన్ హనుమాన్ ఆలయం నుంచి ప్రారంభమయ్యే సీతారాముల ఊరేగింపు, నగర సంకీర్తనలు గోశాలలో ముగిస్తాయి. అనంతరం మహాహారతి కార్యక్రమం ఉంటుంది. ఊరేగింపులో పాల్గొనే పురుషులు తెల్లదుస్తులు, మహిళలు కాషాయం చీరతో హాజరుకావాలని నిర్వాహకులు సూచించారు. ఈనెల 24వ తేదీన గోశాలలో సాయంత్రం 4గంటల నుంచి గీతా, సుందరకాండ పారాయణం, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏనుగు జంగారెడ్డి

కందుకూరు, జనవరి 18 : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ గృహాలను అర్హులందరికీ మంజూరు చేస్తుందని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. గురువారం పీసీసీ సభ్యుడు ఏనుగు జంగారెడ్డి ఆ పార్టీ నేతలతో కలిసి నగరంలోని మంత్రి నివాసంలో కలిసి పేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటీవల జరిగిన ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన ప్రతి హామీ మేరకు, సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశానుసారం లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. నాయకులు అందుగుల సత్యనారాయణ, కె.మదన్‌పాల్‌రెడ్డి, శ్రీశైలం, నర్సింహ పాల్గొన్నారు.

అన్నోజిగూడవాసికి వివేకానంద సేవా పురస్కారం



కందుకూరు, జనవరి 18: మండల పరిధిలోని అన్నోజిగూడ గ్రామానికి చెందిన కాకి సదానందస్వామిముదిరాజ్ నవభారతి నిర్మాణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇచ్చే స్వామి వివేకానంద సేవా పురస్కారం-2024కు ఎంపికైనట్లు ఆ సంస్థ నిర్వాహకులు బత్తుల హేమంత్ తెలిపారు. నేడు శాసనమండలి డిప్యూటి చైర్మన్ బండ ప్రకాశ్, ఎమ్మెల్సీ దయానంద్ గుప్త, నటుడు బాబుమోహహన్ చేతుల మీదుగా అవార్డును అందజేయనున్నట్లు తెలిపారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: మండలంలోని కాచవానిసింగారం ప్రభుత్వ సర్వేనెంబర్ 66లో అక్రమనిర్మాణాలు చేపడుతున్నారని వైఎస్ఎంపీపీ కర్రె జంగమ్మ గురువారం జిల్లా పంచాయతీ అధికారికి ఫిర్యాదు చేశారు. సర్వేనెంబర్ 66లో సర్పంచ్, కార్యదర్శులు ఇళ్ళులేకున్నా ఇంటినెంబర్లు ఇస్తున్నారని తెలిపారు. ప్లాట్లకు నోటరీలను సృష్టించి పంచాయతీ రశీదులను తయారు చేసి అక్రమ నిర్మాణాలు చేసుకునే విధంగా ప్రోత్సహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వభూమిలో అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్న సర్పంచ్, కార్యదర్శిలపై చర్యలు తీసుకోవాలని ఆమె డీపీవోను కోరారు.

బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయాలతో సంస్కార జ్ఞానం


మాట్లాడుతున్న మధు అక్కయ్య

వికారాబాద్, జనవరి 18: సంస్కార జ్ఞానాన్ని ప్రపంచ వ్యాప్తంగా వ్యాప్తి చేయడంలో ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం విశేష కృషి చేస్తోందని ఓంశాంతి కేంద్రం నిర్వాహకురాలు మధు అక్కయ్య అన్నారు. ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం వ్యవస్థాపకులు బ్రహ్మబాబా స్మృతి దినోత్సవం పురస్కరించుకుని గురువారం స్థానిక ఓంశాంతి కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ శివ పరమాత్మ నుంచి బ్రహ్మజ్ఞానం పొందిన బ్రహ్మబాబా రాజయోగమార్గాన్ని మానవులకు వివరించేందుకు ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారన్నారు. మానవులను సంస్కారవంతులుగా, జ్ఞాన సంపన్నులుగా తీర్చిదిద్దేందుకు తన సంపదనంతా దానం చేశారన్నారు. మౌంట్ అబూలో ప్రారంభమైన ప్రజాపిత బ్రహ్మకుమారీస్ విశ్వవిద్యాలయం 154 దేశాల్లో వేలాది శాఖలుగా విస్తరించి సేవలందిస్తోందని చెప్పారు. ఈ సందర్భంగా బ్రహ్మబాబా సూచించిన పలు అంశాలను ఆమె వివరించారు. బ్రహ్మబాబా స్మృతి దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రసాదవితరణ చేశారు.

ఎన్టీఆర్ ఆశయ సాధనకు కృషి చేయాలి



ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నేతలు, అభిమానులు



కొడంగల్: ఐబీలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

మేడ్చల్ టౌన్, జనవరి 18 టీడీపీ వ్యవస్థాపకుడు, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారకరామారావు వర్ధంతిని గురువారం మేడ్చల్‌లో ఘనంగా నిర్వహించారు. మేడ్చల్‌లోని హౌజింగ్‌బోర్డు చౌరస్తా వద్ద ఉన్న ఎన్టీఆర్ విగ్రహానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ తెలుగు ప్రజలకు అందించిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ ఎన్టీఆర్ విగ్రహ పరిరక్షణ కమిటీ అధ్యక్షుడు వాసు వర్మ, టీడీపీ నియోజకవర్గం నాయకులు బొంది సుధాకర్‌గౌడ్, వెంకట్‌రావు, వెంకటేష్‌గౌడ్, వీరస్వామి, కృష్ణా రెడ్డి, మౌలాన, వేణు, శ్రీపాల్ రెడ్డి, నడికొప్పు సుదర్శన్, శేఖర్, భాస్కర్, బాలకృష్ణ, మాధవ్, శేషు, వెంకటరమణ, సురేష్, సత్తార్ పాల్గొన్నారు.

కీసర రూరల్: నాగారం మున్సిపాలిటీ సత్యనారాయణ కాలనీ రోడ్డు నంబర్ 1లో గురువారం ఎన్టీఆర్ 28వ వర్ధంతిని పార్టీ స్థానిక అధ్యక్షుడు కొండా జంగారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు కందికంటి అశోక్‌కుమార్‌గౌడ్‌తో కలిసి మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆ పార్టీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ మల్లేష్‌యాదవ్, కౌన్సిలర్ బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్‌రెడ్డి, టీడీపీ నాయకులు ఉమామహేష్, యాదిరెడ్డి, సుబ్బారావు, నాగేశ్వర్‌రావు, ఉదిష్ఠ, సుజాత, బీఆర్ఎస్ నాయకులు అన్నంరాజ్ శ్రీనివాస్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కొడంగల్: టీడీపీ వ్యవస్థాపకులు, ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం నందమూరి తారక రామారావు 28వ వర్ధంతిని గురువారం టీడీపీ నాయకులు నిర్వహించారు. స్థానిక ఐబీలో టీడీపీ వికారాబాద్ జిల్లా ప్రచార కార్యదర్శి తలారి శేఖర్ ఆధ్వర్యంలో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శాంతికుమార్, బిచ్చప్ప, శ్రీశైలం, చంద్రమౌళి, రాము తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: దిగంవత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీ రామారావు దేశ రాజకీయాలకే ఆదర్శమని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వేముల సంజీవ గౌడ్ అన్నారు. గురువారం ఎన్టీరామారావు 28వ వర్ధంతి సందర్భంగా ఘట్‌కేసర్ లోని అంబేద్కర్ చౌరస్తాలో టీడీపీ జండాను ఆవిష్కరించి ఎన్టీఆర్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సామల జగన్ మోహన్‌రెడ్డి, కొత్త బిక్షపతి, సిస్టా సూర్యనారాయణ, పాటి సురేందర్‌రెడ్డి, టి.మహేష్, వేణుగోపాల్‌రావు పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు



కీసర రూరల్: ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

క్రైం కార్నర్

చేపలు పట్టేందుకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



ఆసిరెడ్డిచెరువు వద్ద గుమిగూడిన గ్రామస్తులు

పెద్దేముల్, జనవరి 18: చెరువులో చేపలు పట్టడానికి వెళ్ళిన వ్యక్తి గల్లంతయ్యాడు. మండలంలోని మంబాపూర్ గ్రామానికి చెందిన గోకరి రాములు, తాడి ఆశప్ప, రేగొండి శ్రీనివాస్‌లు కలిసి గ్రామ సమీపంలోని ఆసిరెడ్డి చెరువులో చేపలు పట్టడానికి వెళ్లారు. వారిలో గోకరి రాములు(58) వల వేయడానికి నీటిలోకి దిగాడు. ఈ క్రమంలో నీటిలో మునిగిపోయాడు. రాములు ఎంతకీ బయటకు రాకపోవడంతో ఆశప్ప, శ్రీనివాస్‌లు రాములు కుటుంబసభ్యులు, గ్రామస్తులకు సమచారం ఇచ్చారు. గ్రామస్తులు చెరువువద్దకు వెళ్లి చెరువులో ఎంత గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో గ్రామస్తులు పెద్దేముల్ పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు చెరువువద్దకు చేరుకుని విచారణ జరిపారు. గల్లంతైన వ్యక్తికోసం పోలీసులు ముమ్మర ప్రయత్నం చేస్తున్నారు.

యువకుడి అదృశ్యం



ఉమేష్

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: ఇంటినుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ మహేందర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్ మున్సిపాలిటీ బాలాజీనగర్‌కు చెందిన మచ్చ ఉమేష్(26) ఈనెల 17వ తేదీన ఇంటినుంచి బయటకు వెళ్లి తిరిగిరాలేదు. దీంతో అతడి కుటుంబసభ్యులు తెలిసిన వారిని, అతడి బంధుమిత్రులను ఆరా తీసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో వారు పోలీసులను ఆశ్రయించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళపై దాడి.. పలువురిపై కేసు

మేడ్చల్ టౌన్, జనవరి 18: ఓ మహిళను విచక్షణారహితంగా చితకబాదిన పలువురిపై మేడ్చల్ పోలీసులు కేసునమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నగరంలోని అమీర్‌పేట నివాసి సుంకరి శ్రావణి అనే మహిళకు మేడ్చల్ మండలం పూడూరు నివాసి కుంట నరేందర్‌రెడ్డితో పరిచయం ఏర్పడింది. నరేందర్‌రెడ్డి శ్రావణిని వివాహం చేసుకుంటానని నమ్మించి మోసం చేయడంతో బాధితురాలు ఇటీవల పేట్‌బషీరాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అయినప్పటికీ నరేందర్‌రెడ్డి పోలీస్‌స్టేషన్‌కు రాకపోవటంతో శ్రావణి మంగళవారం సాయంత్రం నరేందర్‌రెడ్డిని కలవడానికి మండలంలోని అర్కెల్‌గూడలోని అతడి ఎస్టేట్‌కు వెళ్లింది. దీంతో అక్కడ నరేందర్‌రెడ్డితో పాటు ఉన్న అతడి ఇద్దరు మిత్రులు శ్రావణిని దుర్భాషలాడుతూ చితకబాదారు. అంతటితో ఆగకుండా నరేందర్‌రెడ్డి తన కుటుంబసభ్యులను ఫోన్‌చేసి పిలవటంతో అందరూ కలిసి ముకుమ్మడిగా శ్రావణిని విచక్షణారహితంగా చితకబాదారు. దీంతో బాధితురాలు అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో విచారణ చేపట్టిన పోలీసులు దాడి చేసిన వారందరిపై కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో గేదె దూడ మృత్యువాత

దోమ, జనవరి 18: విద్యుదాఘాతంతో ఓ గేదె దూడ మృత్యువాతపడింది. ఈ ఘటన మండలంలోని అయినాపూర్ గ్రామవాసి రాములమ్మకు చెందిన గేదె దూడ గురువారం గ్రామ శివారులో మేత మేస్తుండగా విద్యుత్ మినీ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే మృతి చెందింది. ప్రభుత్వం నుంచి తనకు ఆర్థికసాయం అందించాలని బాధితురాలు వాపోయింది.

చైర్‌పర్సన్‌కు సన్మానం



లక్ష్మీశ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

మేడ్చల్ టౌన్, జనవరి 18: స్వచ్ఛసర్వేక్షణ్‌లో జాతీయ స్థాయి పురస్కారాన్ని అందుకున్న గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మద్దుల లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, కమిషనర్ రాములును గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డాక్టర్ ఏ.రంగాచారి సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు జైపాల్‌రెడ్డి, బేరీ బాల్‌రాజ్, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కండక్టర్ కుటుంబానికి రూ.40లక్షల చెక్కు



లక్ష్మణ్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సజ్జనార్

తాండూరు, జనవరి 18: రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తాండూరు ఆర్టీసీ డిపో కండక్టర్ లక్ష్మణ్ కుటుంబానికి రూ.40లక్షల చెక్కును ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చేతుల మీదుగా అందజేశారు. గతేడాది జూన్ 22వ తేదీన హైదరాబాద్ శివారు హకీంపేట్‌లో జరిగిన జోనల్ స్టాఫ్‌శిక్షణకు వెళ్లగా అక్కడ బైక్ ఢీకొట్టడంతో లక్ష్మణ్ మృతిచెందాడు. ఆపద సమయంలో యూబీఐ సూపర్ సాలరీ సేవింగ్ అకౌంట్స్ సదుపాయం ద్వారా వచ్చిన ప్రమాద బీమా సౌకర్యం మృతుడి కుటుంబాన్ని ఆదుకుంది. కండక్టర్ లక్ష్మణ్ భార్య జ్యోతి కుమారుడు అనిల్ బస్‌భవన్‌లో చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ ఈడీ కృష్ణకాంత్, యుబీఐ మేనేజర్ వెంకటేశ్వర్లు, డీఆర్‌ఎం రాజు, తాండూరు డిపో మేనేజర్ మమత, తాండూరు బ్రాంచ్ మేనేజర్ అరుణ్ ఉన్నారు.

ఆర్టీసీ ఎండీకి చిత్రపటం బహూకరణ

యాలాల: తాండూరు ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా పనిచేస్తున్న జుంటిపల్లి గ్రామానికి చెందిన శ్రీనివాస్‌గౌడ్ తనయుడు నవదీప్‌గౌడ్ తాను గీసిన ఆర్టీసీ ఎండీ సజ్జనార్ చిత్రపటాన్ని గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ భవన్‌లో సజ్జనార్‌కు అందజేశారు. ఆర్టీసీ ఎండీ విద్యార్థిని అభినందించారు. నవదీప్‌గౌడ్ మొయినాబాద్ స్వామినారాయన్ గురుకులంలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ మమత తదితరులు పాల్గొన్నారు.


పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న మురళీధర్‌రావు

మేడ్చల్ టౌన్, జనవరి 18: ఈనెల 22న అయోధ్యలో రామ మందిరంలో చేపడుతున్న రాముడి ప్రాణప్రతిష్ట కార్యక్రమాన్ని పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు బీజేపీ నాయకులు ఆలయాల్లో స్వచ్ఛ తీర్థ్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా పేదలకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. మేడ్చల్ మండల డబీల్‌పూర్ గ్రామ ఇస్కాన్ ఆలయంలో గుండ్లపోచంపల్లి కౌన్సిలర్ సముద్రాల హంసారిణి కృష్ణగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మధ్యప్రదేశ్ బీజేపీ వ్యవహారాల ఇన్‌చార్జి మురళీధర్‌రావు, జిల్లా రూరల్ బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ రెడ్డిలు పాల్గొని ఆలయ పరిసరాలను శుభ్రం చేశారు. అదేవిధంగా గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో స్థానిక బీజేపీ అధ్యక్షుడు ఊసిగారి శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఆలయాలను శుభ్రం చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గం కన్వీనర్ మోహన్‌రెడ్డి, అమరం సరస్వతి, రవీందర్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హన్మంతరెడ్డి మృతి



హన్మంతరెడ్డి(ఫైల్)

బొంరాస్‌పేట్, జనవరి 18: కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు హన్మంతరెడ్డి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ గురువారం మృతి చెందారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే నందారం వెంకటయ్య హయాం నుంచి బొంరాస్‌పేట్ మండలం తరఫున సీనియర్ నాయకుడిగా టీడీపీకి సేవలందించారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే నందారం సూర్యనారాయణకు ప్రధాన అనుచరుడిగా ఉంటూ పార్టీకి సేవలు అందించారు. అప్పట్లో ఎమ్మెల్యేగా కొడంగల్ నుంచి పోటీ చేసిన రేవంత్‌రెడ్డికి బాసటగా నిలుస్తూ ఆయన గెలుపులో ప్రధాన భూమిక పోషించారు. అప్పటి నుంచి నేటి వరకు రేవంతరెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టేంత వరకు బొంరాస్‌పేట్ మండలం నుంచి కాంగ్రెస్ పార్టీకి సేవలు అందించారు. గురువారం ఆయన మృతితో పార్టీ నాయకులు ప్రగాఢ సంతాపం తెలిపారు. అంత్యక్రియలు స్వగ్రామం మెట్లకుంటలో శుక్రవారం నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

నేడు మండల స్థాయి భజన పోటీలు

మోమిన్‌పేట్, జనవరి 18: జస్టీస్ కొండా మాధవరెడ్డి శత జయంతి సందర్భంగా ఆయన కుమారుడు, చేవేళ్ల పార్లమెంట్ సభ్యుడు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని మాణిక్ ప్రభు ఆలయంలో శుక్రవారం భజన పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పోటీల్లో భజన మండలి బృందాలు పాల్గొననున్నాయి.

పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేలా పనిచేద్దాం

● వికారాబాద్

మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్



కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే ఆనంద్

మోమిన్‌పేట్, జనవరి 18: రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు కలిసికట్టుగా కృషి చేయాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. మోమిన్‌పేట్ మండలంలోని వెల్‌చాల్, మొరంగపల్లి గ్రామాల్లో గురువారం బీఆర్ఎస్ కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించారు. పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు లక్ష్మీ శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ కుషాల్‌కుమార్, నాయకులు ఇబ్రహిం, మధుసూదన్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, విజయ్ కుమార్, రత్నం, కృష్ణ, మల్లారెడ్డి పాల్గొన్నారు.

వైద్య శిబిరాలను వినియోగించుకోవాలి

ఉచిత వైద్య శిబిరాలను ప్రజలు వినియోగించుకోవాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ మెతుకు ఆనంద్ అన్నారు. రెనోవా ఆస్పత్రి, లంగర్‌హౌజ్ హైదరాబాద్ వారి ఆధ్వర్యంలో గురువారం మండలంలోని కేసారం గ్రామంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. వైద్య శిబిరంలో వైద్యులు పద్మావతి, ఎండీ.ఆరీఫ్, ఫరీద్ తదితరులు గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలతో పాటు గుండె సంబంధిత పరీక్షలు నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో 200 మందికి వైద్యులు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చంద్రకళ నర్సింహులు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డి.వెంకట్, వైద్య సిబ్బంది జహీర్, రఘుమోహన్, మోసిన్, సుభాన్‌ఖాన్, ఎండీ.కాశీఫ్, ప్రమోద్, రాజ్‌కుమార్‌యాదవ్, అనుపరెడ్డి, శివకుమార్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సిబ్బంది రెండు షిఫ్టుల్లో పనిచేయాలి



మున్సిపల్ కార్మికులతో మాట్లాడుతున్న చైర్‌పర్సన్ ముల్లి పావని యాదవ్

ఘట్‌కేసర్, జనవరి 18: మున్సిపల్ సిబ్బంది రెండు షిఫ్టుల్లో పనిచేయాలని ఘట్‌కేసర్ మున్సిపల్ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్య యాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ సిబ్బందితో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మున్సిపాలిటీని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలన్నారు. నిత్యం ఆయా వార్డుల్లో సంబంధిత జవాన్ పనులను పరిశీలించాలని ఆదేశించారు. ఎక్కడా చెత్త లేకుండా అన్ని వార్డులను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ పల్గుల మాధవరెడ్డి, కమిషనర్ ఎండీ.సాబేర్ అలీ, కౌన్సిలర్ ఆంజనేయులుగౌడ్, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి



మాధవరెడ్డిని సన్మానిస్తున్న బీజేపీ శ్రేణులు

వికారాబాద్, జనవరి 18: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా మాధవరెడ్డి నియామకమయ్యారు. ఈసందర్భంగా వికారాబాద్ పట్టణంలోని ఆయన నివాసం, కార్యాలయం వద్ద పార్టీ శ్రేణులు బాణాసంచా పేల్చి మిఠాయిలు తినిపించుకుని సంబురాలు జరుపుకున్నారు. అనంతరం శివారెడ్డిపేటలోని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యులు శివరాజ్‌ఇంటి వద్దకు బీజేపీ నాయకులు చేరుకుని సంబురాలు నిర్వహించారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని మాధవరెడ్డి తెలిపారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో జిల్లా నుంచి బీజేపీ మంచి ఓట్లు సాధించేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ పదవి అందించడంలో కృషి చేసిన విశ్వేశ్వర్‌రెడ్డి, జనార్దన్‌రెడ్డి, కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

మాధవరెడ్డికి సన్మానం

ధారూరు: బీజేపీ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కోకట్ మాధవరెడ్డిని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి వివేకానందరెడ్డి, ఓబీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి రాజేందర్‌గౌడ్, నాయకులు కృష్ణ, సాయిగౌడ్‌లు గురువారం శాలువాలు కప్పి సన్మానించారు.

శ్రీవారి సన్నిధిలో కుక్కింద భజన బృందం



ధారూరు: తిరుమలలో భజన చేస్తున్న భజన బృందం

ధారూరు, జనవరి 18: తిరుమల తిరుపతి దేవస్థానంలోని శ్రీవారి సన్నిధిలో మండల పరిధిలోని కుక్కింద గ్రామ భజన బృందం భజనలు నిర్వహించారు. తితిదే ఆహ్వానం మేరకు తిరుమలకు వెళ్లిన వారు బుధ, గురువారాల్లో అఖండ హరినామ సంకీర్తన కార్యక్రమంలో పాల్గొని వేంకటేశ్వర, శివనామ, శ్రీరాముని కీర్తనలు, భజనలతో అలరించారు. స్వామివారి ఉచిత దర్శనం కల్పించి, ప్రసాదాలను దేవస్థానం నిర్వాహకులు వారికి అందజేశారు. భజన బృందంలో కుమారస్వామి, సుధాకర్, అనంతయ్య, కిష్టయ్య, పెంటయ్య, అంజనేయులు, నారాయణ, సంగయ్య, వెంకటయ్య, రవి, నందు, వెంకటయ్య, శ్రీనివాస్, బాల్‌రాజ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత మూణ్నాళ్ల ముచ్చటే..!



గుంతలమయమైన వాల్యానాయక్‌తండాకు వెళ్లే రోడ్డు

బషీరాబాద్, జనవరి 18: మండలంలో ఆయా గ్రామాలకు వేసిన తారు(బీటీ) రోడ్ల పనుల్లో నాణ్యత కరువైంది. దామర్‌చెడ్-వాల్యానాయక్ తండాకు వెళ్లే మార్గంలో గతేడాది నిర్మించిన తారురోడ్డు చెరువు కట్టపై ధ్వసంమైంది. ఇక్కడే కొంతదూరం సీసీరోడ్డు అప్పట్లో వేయగా కుంగిపోయి ఎగుడుదిగుడుగా మారి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. బషీరాబాద్ -మైల్వార్, నవాల్గ- నీళ్లపల్లి మార్గంలో ఇటీవల వేసిన బీటీ రెన్యూవల్‌లో నాణ్యత లోపించడంతో పలుచోట్ల రోడ్లు పగుళ్లు ఏర్పడ్డాయి. అప్పట్లో సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేక బీటీ రోడ్లను తూతూమంత్రంగా నిర్మించడంతోనే తారురోడ్లు దెబ్బతింటున్నాయనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.ఈ రోడ్లను వెంటనే మరమ్మత్తులు చేపడితేనే మరింత కాలం మన్నికగా ఉంటాయని పలువురు అభిప్రాయపడుతున్నారు.

వెంకట్‌కు ఎమ్మెల్సీ పదవి ఇవ్వడం హర్షణీయం

ధారూరు, జనవరి 18: ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ టికెట్‌ను బల్మూరి వెంకట్‌కు ఇవ్వటం హర్షణీయమని ఎన్ఎస్‌యూఐ మండలాధ్యక్షుడు అవినాష్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఎస్‌యుఐ రాష్ట్ర అధ్యక్షుడిగా వెంకట్ నిరుద్యోగుల, విద్యార్థుల తరుఫున పోరాటం చేశారని, అధిష్ఠానం ఆయన సేవలను గుర్తించి ఎమ్మెల్సీగా అవకాశం కల్పించడం సామాన్య కార్యకర్తలలో నూతనోత్సాహం నెలకొందని తెలిపారు.

'ఎవరి ప్లాట్లనూ కబ్జా చేయలేదు'

ఘట్‌కేసర్ రూరల్, జనవరి 18: ప్రతాప్‌సింగారం రెవెన్యూ పరిధి సర్వేనెంబర్లు 315, 316, 317ల్లోని ప్లాట్లను కబ్జా చేశానని వచ్చిన ఆరోపణల్లో వాస్తవం లేదని అదే గ్రామానికి చెందిన మలిపెద్ది మధుసూదన్‌రెడ్డి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. సర్వేనెంబర్ 315లో నాలుగు ఎకరాల 17గంటలు, సర్వేనెంబర్ 316 ఎకరం 37గుంటల భూమి తమదేనని తెలిపాడు. వాటికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు సైతం ఉన్నాయని పేర్కొన్నాడు. లేఅవుట్‌లోని 90ప్లాట్లను కబ్జా చేసినట్లు వచ్చిన వార్తలు పూర్తిగా అవాస్తవమని, సర్వేనెంబర్ 317తో తనకు ఎలాంటి సంబంధం లేదని మధుసూదన్‌రెడ్డి స్పష్టం చేశాడు. కొంతమంది కావాలనే తన ప్రతిష్ఠను దెబ్బతీయడానికి ఇలాంటి ఆరోపణలు చేస్తున్నారని తెలిపాడు. ప్లాట్ల విషయంలో న్యాయస్థానం, ట్రిబ్యునల్‌లో తమకు అనుకూలంగా తీర్పు వచ్చిందని గుర్తుచేశాడు. తనపై తప్పుడు ఆరోపణలు చేస్తే తగిన చర్యలు తీసుకుంటానని పేర్కొన్నాడు.

ఎమ్మెల్యేకు సన్మానం



ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డిని సన్మానిస్తున్న తాండూరు మండల పంచాయతీల సంఘం ప్రతినిధులు

తాండూరు రూరల్, జనవరి 18: తాండూరు మండల పరిధిలోని ఆయా గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న కొందరు పంచాయతీ కార్యదర్శులు గురువారం తాండూరు పట్టణంలోని శాంతి నగర్‌లో ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా తమ సమస్యలను ఎమ్మెల్యేకు వివరించినట్లు పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు లాలప్ప తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల సంఘం ప్రతినిధులు ఇస్మాయిల్, రవి పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలి

బొంరాస్‌పేట్, జనవరి 18: ఓటరు జాబితాను పకడ్బందీగా చేపట్టాలని తహసీల్దార్ వెంకటేశ్ బీఎల్‌వోలకు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో బీఎల్‌వోలు, సూపర్‌వైజర్లకు ఓటరు జాబితాపై సలహాలు, సూచనలు చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఓటరు జాబితాలో తప్పులు లేకుండా పకడ్బందీగా రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ రవి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ఇసుక వేలానికి సిద్ధం

బొంరాస్‌పేట్, జనవరి 18: వివిధ గ్రామాల్లో పట్టుబడిన అక్రమ ఇసుకను త్వరలో వేలం వేయనున్నట్లు తహసీల్దార్ వెంకటేశ్ తెలిపారు. మహంతీపూర్, దేవ్లానాయక్ తండాల్లో పట్టుబడిన 20 ట్రాక్టర్ల ఇసుకను వాల్టా చట్టానికి లోబడి వేలం వేయనున్నట్లు తెలిపారు. టన్ను ఇసుక రూ.600కు ధర నిర్ణయించినట్లు తెలిపారు. ఆసక్తి గలవారు వేలంలో పాల్గొని ఇసుకను తీసుకోవాలన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కొడంగల్, జనవరి 18: కొడంగల్ నియోజకవర్గంలోని చిలుముల్‌మైలారంలో తెలంగాణ మైనారిటీ గురుకుల పాఠశాల (బాలురు)లో 2024-25 విద్యాసంవత్సరానికి గాను 5, 6, 7, 8వ తరగతుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మహబూబ్‌పాష గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు.

నిధుల మళ్లింపు వాస్తవమే



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం సురేశ్

దోమ, జనవరి 18: మోత్కూర్ గ్రామ వీవోఏ మల్లేశ్ భార్య రజిత ఖాతాలో రూ.2లక్షల 50వేలు నిధుల మళ్లింపు విషయం వాస్తవమేనని ఏపీఎం సురేశ్ తెలిపారు. ఆ నిధులను గురువారం రూ.10వేలు పంపగా, మిగతా డబ్బులు వడ్డీతో కలిపి ఫిబ్రవరి 1 లోపు వారి ఖాతాలో జమ చేస్తామని వీవోఏ మల్లేశ్ తెలిపారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సురేశ్, సీసీ నారాయణ, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు జ్యోతి, అకౌంటెంట్ మంజుల, గ్రామ మహిళాసంఘం అధ్యక్షురాలు పాల్గొన్నారు.

పేదల కుటుంబాలకు అండగా ఉంటాం



ఆర్థికసాయం అందజేస్తున్న రాజేశ్వరమ్మ

కులకచర్ల, జనవరి 18: పేదల కుటుంబాలకు అండగా ఉంటామని కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ తెలిపారు. మండలంలోని రాంపూర్ గ్రామానికి చెందిన పల్ల బచ్చయ్య హైదరాబాద్‌లో మేస్త్రీ పని చేస్తూ జీవనం కొనసాగించేవాడు. వారం రోజుల కిందట పని చేస్తుండగా రెండంతస్తుల భవనం పైనుంచి పడటంతో తీవ్రగాయాలతో కాలు విరిగింది. ఇంట్లోనే విశ్రాంతి తీసుకుంటున్నాడు. విషయం తెలుసుకున్న కేఎస్ఆర్ ట్రస్టు వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ స్పందించారు. గురువారం గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబానికి ఆర్థిక సాయాన్ని అందజేశారు. అదేవిధంగా కులకచర్లలో అనారోగ్యంతో మృతిచెందిన గుడాల యాదయ్య కుటుంబాన్ని పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాంపూర్, కులకచర్ల గ్రామస్తులు పాల్గొన్నారు.

అందుబాటులోకి మినీ అంబులెన్స్



మినీ అంబులెన్స్‌కు ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి స్టిక్కర్లు అతికించిన కాంగ్రెస్ నాయకులు

కులకచర్ల, జనవరి 18: కులకచర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో మినీ అంబులెన్స్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీఎస్ ఆంజనేయులు తెలిపారు. మినీ అంబులెన్స్‌కు గురువారం పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డివి స్టిక్కర్లు అంటించారు. గతంలో ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి తన సొంత నిధులతో కులకచర్ల ఆసుపత్రికి మినీ అంబులెన్స్ కేటాయించారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అంబులెన్స్‌ను నిర్వీర్యం చేసిందన్నారు. ప్రజలకు మళ్లీ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకొచ్చామని, ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌వో చంద్రప్రకాశ్, కాంగ్రెస్ నాయకులు కృష్ణయ్య, చంద్రయ్య, వెంకటేశ్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.